క్లుప్తంగా

భూ సమస్యలపై వినతుల వెల్లువ

దొరవారిసత్రం : దొరవారిసత్రం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పూలతోట, బూదూరు, కొత్తపల్లి, ఆనేపూడి తదితర గ్రామాలకు చెందిన రైతులు భూసమస్యలపై వినతులు వచ్చినట్టు తహసీల్దార్ శైల కుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన, అధికారులు ఉమామహేశ్వరి, అంకమ్మ, జ్యోతిర్మయి, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల వేడుకోలు

రాపూరు: మండలంలోని వీఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వీఆర్‌ఏ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, షరీఫ్ కోరారు. వారు సోమవారం తహసీల్దార్ నరసింహంకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ 2014 నుంచి వేతనాలు పెంచలేదన్నారు. వేతనాలు పెంచాలని, తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్నట్టు ఇక్కడా పే స్కేల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అర్హత ఉన్న వీఆర్‌ఏలను వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు చంద్రశేఖర్, శంకరయ్య, పెంచలయమ్మ, బుజ్జమ్మ, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ఓజిలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసే ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని డిస్ట్రిక్ట్ మోడల్ మేకర్ వీరరాఘవయ్య, జైతున్‌బీ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వాడకుండా కషాయాలు, ఘనజీవామృతం తదితరాల తో కూరగాయలను పండిస్తున్నట్టు తెలిపారు. రాజేష్, గురవయ్య, చెంచమ్మ, ప్రశాంతి, మాధురి, సాయిప్రియ, షబ్న, రేవతి, సుమతి, చెంచులక్ష్మి, సిద్ధమ్మ, ఉమ,నారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

కోట: సిద్ధవరంలో అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. వారు సోమవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సిద్ధవరంలో ఆరోగ్య ఉపకేంద్రం లేదని, ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ భవనం నిర్మాణ దశలోనే వుందన్నారు. చిన్నారులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. మాజీ ఎంపీటీసీ సురేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు రామయ్య, నాగరాజు, సుబ్బారావు, అంకమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లు, స్టార్టర్ల చోరీ

పెళ్లకూరు: మండలంలోని ఆర్లపాడు గ్రామ సమీపంలో వున్న పొలాల వద్దనున్న వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లను దుండగులు చోరీ చేసినట్టు బాధితులు మణికిరి నారాయణ, మునివర్ధన్‌రెడ్డి, రవికుమార్ వాపోయారు. వారు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చిట్టమూరు : మండలంలోని అద్దెపూడిలో సోమవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. గేదె మేత కోసం సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిందని, అక్కడి ఎర్త్ వైర్లు తగలడంతో మృత్యువాత పడింది. గేదె విలువ సుమారు రూ.40 వేలు ఉంటుదని బాధితుడు బసవనూరు సురేష్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పోలయ్య తెలిపారు.

చంద్రబాబు ఏడాది పాలన అస్తవ్యస్తం

వెంకటగిరి (సైదాపురం) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది పాలన ఘోరంగా విఫలమైందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. ఆయన సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పాత బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదికే ప్రజావ్యతిరేకత మొదలైందన్నారు. 15 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ బెల్, ఎన్టీపీసీఎల్ పరిశ్రమలను స్థాపించారని గుర్తు చేశారు. వాటి గురించి చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. బెల్ పరిశ్రమను ఎందుకు అభివృద్ధి చేయలేదని నిలదీశారు. దుగరాజుపట్నం ఓడరేవును ఎందుకు ఆపారని ప్రశ్నించారు.

నేడు మండల సమావేశం

చిల్లకూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గోపి తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

సర్టిఫికెట్ల కోసం అవస్థలు



చిట్టమూరు : మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆదాయం, కులం, నేటివిటీ తదితర సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మీ సేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులు బారులుతీరారు. గతంలో వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి సర్టిఫికెట్లు తెచ్చి ఇచ్చేవారని, ఇప్పుడు 20 కిలోమీటర్లు ప్రయాణించి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తెచ్చుకోవాలిసి వస్తోందని తీరప్రాంత ప్రజలు వాపోతున్నారు. పనులు కూడా వదులుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లు



కోగిలి చెరువు కలుజు కల్వర్టు కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



ప్రయాణం.. నరకప్రాయం

నాయుడుపేట-మల్లాం రోడ్డులోని కొత్తగుంట గ్రామం నుంచి ఆరూరు గ్రామం వరకు ఉన్న తారు రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. కొత్తగుంట, వడ్డికండ్రి, వేముగుంటపాళెం, తంబుగారి పాళెం గ్రామాల మీదుగా ఆరూరు గ్రామానికి వెళ్లే రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా కల్వర్టుల వద్ద వేసిన తూములు పగిలిపోయి అధ్వానంగా మారింది. కోగిలి చెరువు కలుజు వద్ద రోడ్డు కోతకు గురికావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. రాత్రిళ్లు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించి రోడ్లపై పడిన గుంతలను పూడ్చాలని ఐదు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - చిట్టమూరు



తంబుగారిపాళెం వద్ద రోడ్డుపై ఉన్న గుంత

పారవోలులో తాగునీటి కటకట



గ్రామంలో వున్న త్రీఫేజ్ మోటరు



మరమ్మతులకు గురైన సింగిల్ ఫేజ్ మోటారు

- తరచూ మరమ్మతులకు గురవుతున్న మోటార్లు
- వ్యవసాయ పొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి రూరల్ మండలంలోని పారవోలు హరిజనవాడలో తాగునీటి సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో సమస్య ఏర్పడుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ కాలనీలో సుమారు 200 కుటుంబాలు ఉన్నాయి. వీరికి త్రిఫేజ్, సింగిల్ ఫేజ్ రెండు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. సింగల్ ఫేజ్ మోటారు తరచూ మరమ్మతులకు గురవుతోంది. సరిచేసిన రెండు మూడు రోజులకే మళ్లీ కాలిపోతుండడంతో నీరు సరఫరా కావడం లేదని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న మరో త్రిఫేజ్ మోటారు మాత్రమే కాలనీ వాసులకు నీటిని అందిస్తోంది. కరెంట్ కోతలు ఉండడంతో త్రిఫేజ్ మోటారు పనిచేయడం లేదని, దీంతో నీటి సమస్య ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులను తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

కూటమి పాలనలో అంతా అరాచకమే

- యథేచ్ఛగా ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా
- ఏరులై పారుతున్న మద్యం
- ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు
- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్
- జగన్ అంటే నమ్మకం–బాబు అంటే మోసం పుస్తకావిష్కరణ





జగన్ అంటే నమ్మకం - బాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు

చిల్లకూరు/నాయుడుపేట టౌన్ : కూటమి ఏడాది పాలనలో అంతా అరాచకమేనని, ప్రజలను మోసం, దగా చేయడంతోనే సరిపోయిందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సోమవారం గూడూరులోని సనత్‌నగర్‌లో ఉన్న తన నివాసంలో, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డితో కలిసి నాయుడుపేటలోని తన క్యాంపు కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్ట కాలంలో కూడా సంక్షేమ పథకాలను అమలుచేశారని గుర్తు చేశారు. 98 శాతం హామీలను అమలు చేశారని తెలిపారు. చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలతోపాటు 149 హామీలు ఇచ్చి ఏడాది గడిచినా పథకాల అమలులో ఘోరంగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, లేకుంటే నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని తెలిపారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం కింద రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి మోసం చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన 17 వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు చర్యలు చేపట్టడం సిగ్గుచేటన్నారు.

యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ

కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సహజ వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్నారని ఎమ్మెల్సీ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. ఇసుక, మట్టి, గ్రావెల్‌ను పట్టపగలే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ తాగునీరు ఇవ్వకపోయినా మద్యాన్ని మాత్రం ఇంటింటికీ అందజేస్తున్నారని ఆరోపించారు. బెల్టు షాపులు ఏర్పాటుచేసి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు.

ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిపై తప్పుడు కేసులు బనాయించి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలను వివరిస్తున్న మీడియా గొంతు నొక్కడానికి సైతం వెనకాడలేదన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను న్యాయ స్థానాల ద్వారా అడ్డుకుని ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరిస్తూ ముద్రించిన జగన్ అంటే నమ్మకం–బాబు అంటే మోసం పుస్తకాన్ని ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన, ప్రస్తుత కూటమి పాలనను బేరీజు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గూడూరు పట్టణ, రూరల్, కోట మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ బూదూ రు గురవయ్య, గూడూరు, చిల్లకూరు, కోట, చిట్టమూరు మండలాల నాయకులు, నాయుడుపేటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఎంపీపీలు ధనలక్ష్మి, శేఖర్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, ఒట్టూరు కిషోర్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఓజిలి: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఆయన సోమవారం పున్నేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. ఈ ఏడాది పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్పు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆనేపూడిలో 104 వైద్య సేవలు

దొరవారిసత్రం : స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఆనేపూడి గ్రామంలో సోమవారం 104 వాహనం ద్వారా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి చైతన్య పలువురుకి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

రోడ్డు కోసం ధర్నా

ఓజిలి: మండలంలోని ఏనుగువాడ గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేయాలని గిరిజనులు, సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గిరిజన కాలనీరి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో రోడ్డు నిర్మించాలని కోరారు. చెంగయ్య, ముకుందా పాల్గొన్నారు.

కాలనీల్లో వసతులు కల్పించాలి

చిల్లకూరు : గూడూరు రెండవ పట్టణ ప్రాంతంలోని గాంధీనగర్, ఇందిరానగర్, జగనన్న కాలనీ, టిడ్కో ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లో సోమవారం సీపీఐ మహాసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన కాలనీలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ప్రజలు కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాగునీటి సమస్యను పలుమార్లు మున్సిపల్ అధికారులకు వివరించినా ఫలితం లేదన్నారు. సమావేశంలో గూడూరు నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్,నాయకులు నారాయణ, సీవీఆర్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన కాలనీల్లో ఆధార్ క్యాంపులు

చిల్లకూరు : గిరిజన కాలనీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గోపి తెలిపారు. చిల్లకూరు శంకర గిరిజన కాలనీలో సోమవారం ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఇందులో ఆధార్ లేనివారు కొత్తగా తీసుకోవచ్చని, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెల్లూరు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

చిల్లకూరు : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులు సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. వారు సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అనారోగ్యం బారిన పడిన కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. దారా కోటేశ్వరరా వు, జోగిశివకుమార్, టీవీ రమణయ్య, మణి, వెంకటరమణ, ఆనంద్, రాజా, పెంచలయ్య పాల్గొన్నారు.

కండలేరులో 36.689 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 36.689 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,420, పిన్నేరుకాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కలుజుమిట్ట ఎస్టీ కాలనీలో అధికారుల పర్యటన

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం : మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కలుజు మిట్ట ఎస్టీ కాలనీలో సోమవారం హౌసింగ్ ఏఈ మోహన్‌రావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి మాధవి పర్యటించారు. ఎస్టీల సమస్యలను తెలుసుకున్నారు. కొత్త గృహాల కోసం లబ్ధిదారుల నుంచి అర్జీలు తీసుకున్నారు. కలుజుమిట్ట ఎస్టీ కాలనీలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై గత నెలలో సాక్షి దిన పత్రికలో 'సమస్యలతో సతమతం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు కాలనీలో రెండు రోజుల క్రితం పర్యటించి గిరిజనుల సమస్యలను స్వయంగా పరిశీలించారు. కాలనీలో సుమారు 40 కుటుంబాల వారు పక్కా గృహాల కోసం హౌసింగ్ అధికారులకు వినతులు అందజేశారు. ఇళ్ల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు.



దరఖాస్తులు తీసుకుంటున్న హౌసింగ్ ఏఈ మోహన్‌రావు

పాఠశాలను మార్చవద్దని తల్లిదండ్రుల నిరసన



నిరసన తెలుపుతున్న యాకసిరి గ్రామస్తులు



కలెక్టర్‌కు విన్నవిస్తున్న కాశీపురం సర్పంచ్ మమత



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

చిట్టమూరు : తమ గ్రామంలో వున్న ప్రాథమిక పాఠశాలను మార్చవద్దని యాకసిరి గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారు సోమవారం ఎమ్మార్సీ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 1, 2 తరగతులను ఉంచి 3, 4, 5 తరగతుల విద్యార్థులను 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఎస్ఎస్ఎస్ నగర్ కాలనీలోని మోడల్ స్కూలుకు తరలిస్తున్నారని వాపోయారు. మెయిన్ రోడ్డు కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, పిల్లలు నడిచి వెళ్లేటప్పుడు ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి యాకసిరి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను అలాగే కొనసాగించాలని కోరారు. అనంతరం ఎంఈవో బీవీ కృష్ణయ్యకు వినతి ప్రతం అందజేశారు.

పాఠశాలను తరలించవద్దని కలెక్టర్‌కు వినతి

వాకాడు : మండలం కాశీపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని పిల్లలను కొండాపురం పాఠశాలలో విలీనం చేయొద్దని సర్పంచ్ మమత, గ్రామస్తులు కోరారు. వారు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పిల్లలు అంతదూరం నడిచి వెళ్లి రావాల్సి ఉంటుందని, పలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

పాఠశాలను యధావిధిగా కొనసాగించాలి

బాలాయపల్లి(సైదాపురం) : తమ గ్రామంలో ఉన్న పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని బాలాయపల్లి మండలం అలిమిలి అరుంధతీయవాడ వాసులు కోరారు. వారు సోమవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 3, 4, 5 తరగతులు చదువుతున్న సుమారు 30 మంది పైగా చిన్నారులను ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న మన్నూరు పాఠశాలలో విలీనం చేయడం తగదన్నారు. అధికారులు స్పందించి పాఠశాలను కొనసాగించాలని కోరారు. అనంతరం విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

తరగతుల విలీనంతో విద్యార్థులకు కష్టాలు

కోట: మండలంలోని నార్త్ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను జరుగుమల్లి పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం తల్లిదండ్రులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కాలనీలో పాఠశాలను రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారని వాపోయారు. పిల్లలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు ఎలా వెళతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ వరలక్ష్మీ పాల్గొన్నారు.

మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని బజారు వీధిలో ఉన్న మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని 14వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఆరి శంకరయ్య కోరారు. ఆయన సోమవారం పాత మార్కెట్ భవనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో సర్వే నంబర్ 279లో ఎకరా స్థలంలో నిర్మించిన మార్కెట్ భవనాలు శిథిలావస్థకు గురైనట్టు తెలిపారు. వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.



పాత మార్కెట్ భవాలను పరిశీలిస్తున్న ఆరి శంకరయ్య

మస్తానయ్యకు నివాళి

దొరవారిసత్రం : మండలంలోని పోలిరెడ్డిపాళెం మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు గుర్రం మస్తానయ్య అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం గొల్లపాళెం గ్రామానికి చేరుకున్నారు. మస్తానయ్య మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

ఆర్టీసీ డిపో మేనేజర్ వైఖరిపై కార్మికుల నిరసన

వాకాడు : వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్ మొండి వైఖరిపై నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) నాయకులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు సోమవారం డిపో గేట్ వద్ద రెడ్ బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ డిపోలో పనిచేస్తున్న కార్మికుల పట్ల డీఎం పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఒక యూనియన్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చి మిగిలిన వారిని చిన్న చూపు చూస్తున్నారని పేర్కొన్నారు. డిపోలోని బస్సు సర్వీసులను తన ఇష్టానుసారంగా నడిపిస్తూ కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం వాకాడు గొల్లపాళెం గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డిని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎన్ఎంయూఏ డిపో గౌరవ అధ్యక్షుడిగా ఉండాలని కోరారు.



ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

బాధితులకు ఆర్థిక సాయం

వాకాడు : మండలంలోని చినతోట గ్రామం గిరిజన కాలనీకి చెందిన చెంచయ్య, మైత్రి దంపతుల పూరిల్లు ఆదివారం రాత్రి కాలి బూడిదైంది. దేవుడి పటాల వద్ద వెలిగించిన ప్రమిదను ఎలుకులు కదిలించడంతో మంటలు చెలరేగి ఇల్లు కాలిపోయింది. ఇంటిలోని వారు కట్టుబట్టలతో మిగిలారు. దీంతో ఏఆర్డీ సంస్థ ప్రతినిధులు వారికి రూ.10 వేలు, గ్రామానికి చెందిన మునిశేఖర్ రూ.5 వేలు సాయం చేశారు. కార్యక్రమంలో ఏఆర్డీ సంస్థ ప్రతినిధులు రామానుజం, పర్యావరణ యువజన సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నగదు అందజేస్తున్న సుబ్రమణ్యం

గ్రీవెన్స్‌డేకు అధికారుల డుమ్మా

నాయుడుపేట టౌన్: మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. తహశీల్దార్ మాగర్ల రాజేంద్ర, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీవో సురేష్, ఈవోపీఆర్‌డీ గోపాల్, పశు సంవర్ధకశాఖ ఏడీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గ్రీవెన్స్‌కు హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో, తహసీల్దార్ తెలిపారు.

వెంకటగిరి ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి ఎస్‌ఐగా ఏడుకొండలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సుబ్బారావుపై ఆరోపణలు రావడంతో జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు ఇటీవల వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఏడుకొండలును వెంకటగిరి ఎస్‌ఐగా నియమించారు.



ఏడుకొండలు

నేడు పుస్తకావిష్కరణ

ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కారానికి కృషి

నాయుడుపేట టౌన్ : వృద్ధుల చట్టపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మీనాక్షి సుందరం తెలిపారు. పట్టణంలోని మేరీ వృద్ధాశ్రమంలో సోమవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వృద్ధులకు రక్షణగా వున్న చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచుకిష్టయ్య, న్యాయవాదులు చదలవాడ కుమార్, పరశురామ్, సునీల్, నిరంజన్ పాల్గొన్నారు.